సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 11 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు, కనిష్టం రూ.14 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.18 ధర పలికింది. మార్కెట్‌కు 170 టన్నుల సరుకు వచ్చింది.

గరిష్టం/కనిష్టం
40.3°/20.6°

జిల్లా పరిధిలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం పెరిగింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో పడమటి దిశగా గాలి వీచింది.

ఉపాధి కూలీకి ఊతం

- కూలి రూ.300కు పెంచిన ప్రభుత్వం
- ఏప్రిల్ 1 నుంచి పెంచిన వేతనం
- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు



ఓడీ చెరువు వద్ద కుంటలో పనులు చేస్తున్న కూలీలు

పుట్టపర్తి అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వరంగా మారింది. వ్యవసాయ పనులు లేని సమయంలో స్థానికంగా పనులు కల్పించడంతో వలసలకు పూర్తిగా చెక్ పడింది. తాజాగా కనీస వేతనం రూ.300కు పెంచడంతో కూలీల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. పెంచిన వేతనం ఈ నెల నుంచే అమలవుతుండగా..జిల్లాలోని 2,11,000 జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలకు లబ్ధి కలుగుతోంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లాలో 58 వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు కానుందని అధికారులు చెబుతున్నారు.

కనీస వేతనం రూ.300 అందేలా చర్యలు..

ప్రభుత్వం ఇప్పటి వరకూ ఉపాధి కూలీలకు రోజుకు కనీస వేతనం రూ.272 ఇచ్చేది. ఈ మొత్తాన్ని ఏప్రిల్ 1వ తేదీ నుంచి రూ.28 పెంచి రూ.300 చేసింది. అలాగే ఈ ఏడాది జిల్లాలో 75 లక్షల పని దినాలు కల్పించాలని అధికారులు లక్ష్యం విధించుకున్నారు. ఈ క్రమంలో కూలీలకు రూ.225 కోట్లు వేతనం, మెటీరియల్‌కు కలిపి ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడంతో ఉదయమే పనులకు వెళ్లి 11 గంటలకు ఇంటికి వచ్చేలా సూచనలు ఇచ్చారు. కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచారు.

ఉపాధి హామీలో చేపట్టనున్న పనులు..

భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఉపాధి పనుల్లో ఎక్కువ శాతం వర్షపు నీటి నిలువ పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అలాగే చెరువులు, కుంటలు, సప్లయి ఛానళ్లు, ఫీడర్ ఛానళ్లలో పూడిక తీత పనులు, కొండ చుట్టూ కింది భాగంలో ట్రెంచ్‌లు, పొలం సరిహద్దు కందకాలు, తోటల్లో రింగ్ ట్రెంచ్‌లు, స్మశాన వాటికల అభివృద్ధి, పొలాలకు వెళ్లే రోడ్లకు మట్టి పనులు, భూసారం కొట్టుకుపోకుండా భూమి వాలుకు అడ్డుగా ట్రెంచ్‌ల ఏర్పాటు, జగనన్న కాలనీల్లో సోక్ పిట్ నిర్మాణం తదితర పనులు చేపడుతున్నారు. ఎండలు పెరిగిన నేపథ్యంలో సులభమైన పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో యాక్టివ్ జాబ్ కార్డులు	2.11 లక్షలు
పనులు చేస్తున్న కూలీల సంఖ్య	2.69 లక్షలు
ప్రస్తుతం పనులకు వస్తున్న కూలీల సంఖ్య	58 వేలు
ఈ ఏడాది పని దినాల లక్ష్యం	75 లక్షలు
కూలీలకు ఇవ్వనున్న వేతనం	రూ.225 కోట్లు
రోజూ సగటు వేతనం	రూ.300

1.50 లక్షల కూలీలకు ఉపాధి..

జిల్లాలో 1.50 లక్షల జాబ్ కార్డులున్నాయి. అందులో 2.69 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడా వ్యవసాయ పనులు జరుగుతుండటంతో కనీసం 1.50 లక్షల మందికి ఉపాధి హామీ పనులు కల్పించే విధంగా అధికారులు వివిధ పనులను గుర్తించారు. గత ఏడాది 10,319 కుటుంబాలు వంద రోజులు పూర్తి చేసుకోగా, కొంత మంది 80 రోజులు పూర్తి చేసుకున్నారు. వారందరికీ గత ఏడాది సుమారు రూ.170 కోట్లు ఖర్చు చేశారు.

వేతనం పెంచడం సంతోషం



ఉపాధి హామీ పథకంలో పని చేసే వారికి కనీస వేతనం పెంచడం చాలా సంతోషంగా ఉంది. వ్యవసాయ పనులు ముగియగానే మమ్మల్ని ఉపాధి పనులే ఆదుకుంటున్నాయి. మా కుటుంబంలో నలుగురూ ఉపాధి పనులకే వెళ్తాం. గతంలో రూ.272 చొప్పున కూలీ వచ్చేది. ఈ నెల నుంచి రూ.300 కూలీ ఇవ్వనున్నట్లు అధికారులు చెప్పారు. చాలా సంతోషంగా ఉంది.

– నాగలక్ష్మి, ఉపాధి కూలీ, ఓడీచెరువు

'ఉపాధి' మాకు ఆధారం



మాకు పొలం లేదు. వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాం. వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి హామీ పనులే మమ్మల్ని ఆదుకుంటున్నాయి. అధికారులు క్రమం తప్పకుండా పనులు కల్పిస్తున్నారు. వేతనం కూడా సకాలంలో అందుతోంది. కూలీల కష్టాలను అర్థం చేసుకుని కూలి పెంచడం ఆనందంగా ఉంది.

– లక్ష్మీనరసమ్మ, జగరాజుపల్లి, పుట్టపర్తి మండలం

అడిగిన వారందరికీ పని



ఉపాధి హామీ పథకంలో భాగంగా అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం. గ్రామాల్లో ఇప్పటికే పనులు చేయడానికి ప్రాంతాలను గుర్తించాం. 1.50 లక్షల మందికి పనులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– విజయేంద్ర ప్రసాద్, పీడీ, డ్వామా

న్యూస్‌రీల్

అల్లా దీవెనలు అందరిపై ఉండాలి



మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలకు ఎస్పీ మాధవరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దీవెనలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్‌ను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్ల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించే రాత పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు బుధవారం విడుదలయ్యాయి. ఈనెల 21న అర్హత పరీక్ష ఉంటుందని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లో 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లు https://cse.ap.gov.in లేదా https://apms.apcfss.in/ StudentLogin.do వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు/ ఇంగ్లిష్ మాధ్యమాల్లో రాయవచ్చని డీఈఓ వెల్లడించారు.

ఉల్లాసంగా వన భోజనాలు



లక్ష్మీనరసింహస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: ఏకపాదంపల్లిలో బుధవారం వన భోజనాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఉగాది పండుగ మరుసటి రోజున గ్రామస్తులందరూ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో వన భోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం ఆరు గంటలకే గ్రామస్తులు ఇళ్లకు తాళాలు వేసి సరుకులు, వంటసామాగ్రిని ఉంచిన గంపను నెత్తిమీద ఎత్తుకుని పిల్లాపాపలు, పశువులను తీసుకుని ఆలయ ప్రాంగణంలోకి చేరుకున్నారు. అక్కడ పిండి వంటలు చేసుకుని ఆరగించిన అనంతరం మహిళలు ఉయ్యాలలూగగా, మగవారు టెంకాయ, రాళ్ల పందేలను ఆడారు. సాయంత్రం వరకు సరదాగా గడిపి పొద్దు మునిగిన అనంతరం ప్రతి మహిళ ఒక బిందె నీరు బొడ్రాయికి పోసిన అనంతరం లక్ష్మీనరసింహస్వామిని గ్రామంలో ఊరేగించారు.

కసాపురం వద్ద తెగిన విద్యుత్ లైన్

- గుర్తించిన పెట్రోలింగ్ గ్యాంగ్
- వేగంగా సరఫరా పునరుద్ధరణ

సాక్షి, అమరావతి: విద్యుత్ లైను తెగిన కారణంగా గుంతకల్లు వద్ద 132 కేవీ గుత్తి రిసీవింగ్ స్టేషన్(ఆర్‌ఎస్) సింగిల్ సర్క్యూట్ లైన్ బుధవారం ఉదయం 8:15 గంటలకు ట్రిప్ అయింది. ఈ మేరకు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు 'సాక్షి'కి తెలిపారు. గుత్తి గ్యాంగ్ ఫీడర్‌పై పెట్రోలింగ్ చేసినప్పుడు ఫేజ్ కండక్టర్ స్నాప్ చేసినట్లు గుర్తించారు. దీంతో ఉదయం 8:20 గంటలకు బ్రేక్‌డౌన్ ప్రకటించారు. 132కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని గుంతకల్లు–ఉరవకొండ ప్రాంత గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా కోసం 33కేవీ స్థాయి ఫీడర్ల నుంచి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. రైల్వేకు సంబంధించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా 220 కేవీ లైన్ ద్వారా గుత్తి నుంచి అనుసంధానం చేశారు. గుంతకల్లు – కసాపురం గ్రామ రహదారి వద్ద బ్రేక్‌డౌన్ సైట్‌కు చేరుకున్న సాంకేతిక సిబ్బంది కండక్టర్ రెసిడెన్షియల్ ప్రాంతం (జర్నలిస్ట్ కాలనీ)లో పడిపోయిన దాదాపు 100 మీటర్ల కండక్టర్‌ను భర్తీ చేశారు. ఫేజ్ కండక్టర్ ఫీడర్‌ను సరిగ్గా నిలిపి మిడ్–స్పాన్ జాయింట్ వేశారు. మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం మధ్యాహ్నం 2.44 గంటలకు లైన్ ఛార్జ్ చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఫీడర్ సాధారణ స్థితికి చేరుకున్న వెంటనే గృహ, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


ఇంటిపన్నుపై డిస్కౌంట్

- ఒకే సారి పన్ను చెల్లిస్తే 5శాతం రిబేట్

పుట్టపర్తి: ఇంటి పన్నుపై డిస్కౌంట్(రిబేట్) వచ్చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నును ఒకేసారి చెల్లిస్తే..5 శాతం రిబేట్‌ను ఇస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు రాయితీకి అవకాశం ఉంటుందని, జిల్లాలోని అన్ని మున్సిపల్ పరిధిలోని అసెస్‌మెంట్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కనిపించిన నెలవంక

- నేడు రంజాన్ పర్వదినం
- ఈద్ ముబారక్ చెప్పుకున్న ముస్లింలు
- ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాల్లో ఏర్పాట్లు



పుట్టపర్తి టౌన్: నెలవంక దర్శనంతో నెలరోజుల కఠోర ఉపవాస దీక్షలను ముస్లింలు బుధవారం ఇఫ్తార్‌తో ముగించారు. గురువారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా చేసుకునేందుకు సిద్ధమయ్యారు. బుధవారం సాయంత్రమే పండుగ సామగ్రి కొనుగోళ్లతో ప్రధాన పట్టణాల్లో మార్కెట్‌లు కిటకిటలాడాయి. ఇక మతపెద్దల సూచనల మేరకు కదిరి, ధర్మవరం, హిందూపురం, పుట్టపర్తి, పెనుకొండ తదితర పట్టణాలతో పాటు జిల్లాలోని మసీదులు, ఈద్గాల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. రంజాన్ ప్రార్థనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల తర్వాత టీడీపీ కనుమరుగు

- మంత్రి ఉషశ్రీ చరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: 'జన బలం ముందు..జెండాల బలం నిలబడ లేదు. రానున్న ఎన్నికల్లో ప్రజాభిమానంతో వైఎస్సార్ సీపీ అన్ని స్థానాల్లో అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయం. ఆ తర్వాత టీడీపీ కనుమరుగు కావడం తథ్యం' అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ అన్నారు. బుధవారం ఆమె సోమందేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిలకడలేని రాజకీయాలు చేస్తూ జోకర్‌గా మారారన్నారు. వలంటీర్లను ఉగ్రవాదులతో పోల్చిన పవన్ కల్యాణ్, వలంటీర్ల వ్యవస్థ రద్దు చేస్తామని చెప్పిన లోకేష్, చంద్రబాబు ఇప్పుడు తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేల జీతం ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంచడంతో పాటు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి సేవలందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు కుట్ర పన్ని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. మరో రెండు నెలల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయిన వెంటనే వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరిస్తారని, అప్పుడు 1వ తేదీ తెల్లవారుజామునే వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తారన్నారు. చంద్రబాబు నిజం చెబితే ఆయన తల పగులుతుందనే శాపం ఉందని వైఎస్సార్ చెప్పేవారని, ఇప్పుడు టీడీపీ మేనిఫెస్టో చూస్తే ఆదే గుర్తుకు వస్తోందన్నారు. అధికారం కోసం గతంలోనూ 600 హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదని, ఇప్పుడు మళ్లీ 'సూపర్ సిక్స్' అంటూ జనాన్ని మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కానీ విజ్ఞులైన ప్రజలు ఏకంగా టీడీపీనే రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ అశోక్, ఎంపీపీ గంగమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు వెంకటరత్నం, రఫీక్, కొల్లప్ప, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీ నరసప్ప, కంబాలప్ప తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలను చేరుకోవాలి

- జేసీ అభిషేక్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన చేరుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ నివేదికలు సిద్ధం చేయాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఏ కారణం వల్లనైనా దరఖాస్తులు తిరస్కరించినా, రుణాలు మంజూరు చేయకపోయినా అందుకు గల కారణాలు తెలిపుతూ నివేదికలను తనకు పంపాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం రమణకుమార్, నాబార్డు ప్రతినిధి అనురాధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, జౌళిశాఖ అధికారి రమేష్‌బాబు, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

'పాలిసెట్'కు పటిష్ట ఏర్పాట్లు

పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే 'పాలిసెట్' పరీక్షకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో పాలిసెట్ నిర్వహణపై ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. 27 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష ఉంటుందన్నారు. జిల్లా నుంచి 8 వేల మంది పాలిసెట్‌కు హాజరు కానుండగా, వారి కోసం 23 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పాలిసెట్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. అలాగే సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు సమన్వయం చేసుకుని పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. సమీక్షలో డీఈఓ మీనాక్షి, పాలిసెట్ అధికారి సురేష్‌బాబు, ఏఓ రామాంజులరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా, డీపీటీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

టీటీసీ శిక్షణ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) వేసవి శిక్షణ తరగతులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి జూన్ 12వ తేదీ వరకు 42 రోజుల పాటు అనంతపురంలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు కూడా వెబ్‌సైట్ అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

కమనీయం.. జ్యోతుల ఉత్సవం



ముదిరెడ్డిపల్లిలో కొలువుదీరిన చౌడేశ్వరీదేవి అమ్మవారు



పురవీధుల గుండా సాగుతున్న పూజమ్మ, చౌడేశ్వరీదేవి శోభాయాత్ర

- వైభవంగా సాగిన చౌడేశ్వరీదేవి జ్యోతుల ఊరేగింపు
- భక్తులతో కిటకిటలాడిన ముదిరెడ్డిపల్లి



ఊరేగింపులో జ్యోతులు నెత్తిన పెట్టుకుని నృత్యాలు చేస్తున్న దృశ్యం

హిందూపురం: ఆధ్యాత్మిక శోభ.. జ్యోతుల వెలుగుల్లో ముదిరెడ్డిపల్లి కాంతులీనింది. ముదిరెడ్డిపల్లి వెలసిన తొగట వీరక్షత్రియుల ఆరాధ్యదైవం చౌడేశ్వరీదేవికి బుధవారం జ్యోతుల మహోత్సవం నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరాగా, ముదిరెడ్డిపల్లి కిటకిటలాడింది. బుధవారం తెల్లవారుజామునే చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టుచీరలు, వెండి ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా దీక్షబూనిన పురుషులు పంచమి జ్యోతులను తలపై ఎత్తుకుని ఆలయం వద్ద నుంచి ముదిరెడ్డిపల్లి పురవీధుల గుండా నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లారు. వారు చేసిన నృత్య విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. అనంతరం ముదిరెడ్డిపల్లి వాసులు చౌడేశ్వరీదేవి అమ్మవారికి కోళ్లు, గొర్రెలను సమర్పించి బంధువులు, సన్నిహితులకు విందు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రముఖులు, పట్టణవాసులు పాల్గొన్నారు. అలాగే పూజమ్మ, చౌడమ్మ ఉత్సవ మూర్తులను ట్రాక్టర్లపై కొలువుదీర్చి శోభాయాత్ర నిర్వహించారు. ప్రజలు తరలివచ్చి అమ్మవార్లకు పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష



ఉట్లమాను వేడుకలను తిలకిస్తున్న జనసందోహం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన ఉట్లమాను పరుష వైభవంగా జరిగింది. ఉగాది పండుగ అనంతరం దుర్గమ్మ ఆలయం వద్ద ఉట్లమాను పరుష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో బుధవారం సాయంత్రం ఉట్లమాను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బోయ కులస్తులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తప్పెట్లు, డప్పుల వాయిద్యాల నడుమ చిందులు వేస్తూ ఉట్లమాను వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఉట్లమాను చుట్టూ బురదను ఏర్పాటు చేశారు. ఉట్లమానుకు పూజలు చేసిన అనంతరం ఉట్లమానుపైకి ఓ యువకుడిని తాడు సాయంతో ఎక్కించారు. పైన కూర్చున్న వ్యక్తి బురదను ఉట్లమానుకు పోస్తున్న సమయంలో యువకులు కింద నుంచి స్నేహితుల సాయంతో ఉట్లమాను ఎక్కేందుకు ప్రయత్నించారు. ఉట్లమాను ఎక్కుతూ... జారుతూ... బురదలో పడిపోతూ నవ్వులు పూయించారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వేలాది మంది తరలివచ్చారు. ఉట్లమాను ఎక్కుతున్న యువకులను ప్రోత్సహిస్తూ ప్రజలు కేరింతలు, చప్పట్లు కొట్టారు.

విజేతకు రూ.10,116 అందజేత..

ఉట్లమాను ఎక్కేందుకు వందలాది మంది యువకులు పోటీపడగా, చివరకు బోయ వంశీ విజేతగా నిలిచాడు. దీంతో నిర్వాహకులు అతనికి రూ.10,116 నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో ఉట్లమాను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోయ నరసింహులు, సభ్యులు వడ్డే శ్రీనివాసులు, కొడవండ్లపల్లి నారాయణస్వామి, రంగుల నారాయణ, సాకే రామచంద్ర, మేకల నారాయణ, రాజా, చిన్న నరసింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందిస్తున్న ఉట్లమాను ఉత్సవ కమిటీ సభ్యులు

క్లుప్తంగా

గోవధ చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

రొద్దం: మండలంలోని చెరుకూరు గ్రామ సమీపంలో గోవధకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రొద్దం ఎస్‌ఐ బాషావలి తెలిపారు. అందిన ముందస్తు సమాచారంతో బుధవారం సాయంత్రం చెరుకూరు శివారులో తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో పశువును కోస్తున్న నయాజ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, గోవధ నిషేధ చట్టం కింద కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు వివరించారు.

ప్రమాదంలో ఇద్దరి మృతి



అంజనమూర్తి (ఫైల్) శివప్ప (ఫైల్)

పరిగి: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు... పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లికి చెందిన అంజనమూర్తి బుధవారం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మోదా పంచాయతీ ఎం.చెర్లోపల్లి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న కర్ణాటకలోని తుమకూరు జిల్లా తేరియూరి గ్రామానికి చెందిన శివప్ప ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి చేర్చారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మద్యం అక్రమ తరలింపును అడ్డుకోండి


సెబ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

హిందూపురం అర్బన్: పొరుగు రాష్ట్రం నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం తరలిరాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఆదేశించారు. బుధవారం హిందూపురం, మడకశిర సెబ్ స్టేషన్లతో పాటు తూమకుంట, కొడికొండ చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ నెల 26న కర్ణాటకలో ఎన్నికల జరగనున్న నేపథ్యంలో జిల్లా సరిహద్దు గ్రామాల్లోకి అక్రమంగా మద్యం నిల్వ చేసే అవకాశముందని, ఈ విషయంగా అప్రమత్తంగా వ్యవహరిస్తూ అక్రమ మద్యాన్ని అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట హిందూపురం సెబ్ సీఐలు రాజశేఖరగౌడ్, ధీరజ్‌రెడ్డి, కొడికొండ చెక్‌పోస్టు సీఐ శ్రీరాములు, తూమకుంట ఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

రాయలసీమ షర్బత్.. నన్నారి

- వేసవి తాపానికి మంచి ఉపశమనం
- నన్నారిలో ఔషధ గుణాలెన్నో..


నన్నారి వేర్లు


గాండ్లపెంటలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన నన్నారి బాటిళ్లు



కదిరి: వేసవి ఎండలు మండుతున్నాయి. ఎండ వేడిమి నుంచి కాసింత ఉపశమనం కోసం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కూల్ డ్రింక్ దుకాణాలు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. పైగా డ్రింక్స్ తాగుతున్న వారిలో అత్యధికులు నన్నారి షర్బత్‌నే ఇష్టపడుతుండడం గమనార్హం. రాయలసీమ జిల్లాల్లో లభించే ఎన్నో ఔషధ గుణాలున్న సుగంధి పాల చెట్టు వేర్ల నుంచి నన్నారి షర్బత్ తయారు చేస్తారు. వీటిని ఈ ప్రాంతంలో నన్నారి వేర్లు అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ఈ వేర్లు ఎక్కువగా లభిస్తాయి.

వివిధ ప్రాంతాలకు ఎగుమతి..

కదిరి ప్రాంత వాసులు కొందరు దశాబ్దాలుగా నన్నారి తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకుని జీవనం సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఇక్కడి నుంచి నన్నారి బాటిళ్ల రూపంలో ఎగుమతి అవుతోంది. ఈ ప్రాంతం నుంచి సౌదీకి వెళ్లే వారు కూడా అక్కడి వారి కోసం తమ వెంట నన్నారి బాటిళ్లను తీసుకెళుతుండడం విశేషం. లీటర్ నన్నారి బాటిల్ ప్రస్తుతం రూ.150తో విక్రయిస్తున్నారు.

వట్టి వేర్ల నుంచి తయారీ..

దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన నన్నారి షర్బత్‌ను సుగంధిపాల చెట్టు వేర్ల నుంచి తయారు చేస్తారు. ముందుగా సేకరించుకున్న చెట్టు వేర్లను చిన్నచిన్నముక్కలుగా చేసి, ఎండబెడతారు. తర్వాత వాటిని రాత్రంత నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఆ నీరు సగమయ్యే వరకూ రెండు, మూడు గంటల పాటు మరగనిస్తారు. చల్లార్చి వడపోసిన ఆ మిశ్రమానికి తగినంత పంచదార కలిపి మరోసారి బాగా వేడి చేస్తారు. అది కొద్దిపాటి పాకంగా మారిన తర్వాత తీసి బాటిళ్లలో నింపి అమ్మకానికి సిద్ధం చేస్తారు. ఇలా తయారు చేఉసిన షర్బత్‌ను ఓ గ్లాసులో రెండు స్పూన్ల చొప్పున వేసుకుని దానికి సగం నిమ్మకాయ రసం, చల్లని సోడా కలిపి అందజేస్తే రుచి అదిరిపోతుంది. దీనికి నీళ్లలో నానబెట్టిన సబ్జా గింజలను కలిపి సేవిస్తే శరీర ఆరోగ్యానికి ఇంకా మంచిదని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. నన్నారిలోని ఔషధ గుణాలు శరీర ఉష్ణోగ్రతను బాగా తగ్గిస్తాయని అంటున్నారు.

ఆల్ టైమ్ మంచి గిరాకీ



నేను పదేళ్లకు పైగా నన్నారి వ్యాపారం చేస్తున్నా. కువైట్‌కు వెళ్లే వారు కూడా మా దగ్గర నుంచి నన్నారి కొనుగోలు చేసుకుని అక్కడికి తీసుకెళుతుంటారు. ఎండాకాలంలోనే కాదు... సీజన్ ఏదైనా నన్నారికి మంచి డిమాండ్ ఉంటోంది. గతంలో ఒక బాటిల్ నన్నారి షర్బత్‌ను రూ.100తో అమ్మేవాళ్లం. ఇప్పుడు రూ.150 చొప్పున విక్రయిస్తున్నాం. నన్నారి ఒక గ్లాసు రూ.25 అమ్ముతున్నాం.

– మహబూబ్‌బాషా, నన్నారి వ్యాపారి, గాండ్లపెంట

నన్నారి బెస్ట్



నన్నారి జ్యూస్ ఎక్కువగా దొరికేది మన రాయలసీమలోనే. బహుళ జాతి కంపెనీల డ్రింక్స్ కన్నా సహజసిద్ధంగా లభించే నన్నారి ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది శరీర ఉష్ణోగ్రతను బాగా తగ్గిస్తుంది. దీని తయారీకి ఉపయోగపడే సుగంధి పాల చెట్టుకు ఎన్నో ఔషధ గుణాలున్నాయి. నిల్వ చేసిన ధాన్యంలోనూ ఒకట్రెండు నన్నారి వేర్లు ఉంచితే ధాన్యం పురుగు పట్టదు.

– డాక్టర్ మదన్‌కుమార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్, కదిరి

మీరు ప్రచారానికి రావొద్దు!

- మీరొస్తే మైనార్టీ ఓట్లు దూరమవుతాయి
- బీజేపీ నేతలకు స్పష్టం చేసిన టీడీపీ అభ్యర్థులు
- అంతర్గతంగా పనిచేయాలని సూచన
- రాయదుర్గం, ఉరవకొండలో టీడీపీ తీరుపై బీజేపీ శ్రేణుల విస్మయం
- 'పొత్తు ధర్మం' ఇదేనా అంటూ ఆవేదన



రాయదుర్గం/ఉరవకొండ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ప్రస్తుత ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. మూడు పార్టీల శ్రేణులు కలసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తాయని ఆ పార్టీల అధినేతలు తరచూ ప్రకటిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. బీజేపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీ అభ్యర్థులు పూర్తిగా విస్మరిస్తున్నారు. 'పొత్తు ఉంటే ఉండనీ..మీరు మాత్రం మా వెంట రావొద్దు. మీరొస్తే వచ్చే ఓట్లు కూడా పోతాయి. ముఖ్యంగా మైనార్టీ ఓట్లు దూరమవుతాయి' అంటూ తెగేసి చెబుతున్నారు. ఈ విషయంలో కొందరు బీజేపీ నేతలు సర్దుకుపోతున్నప్పటికీ..కేడర్ మాత్రం టీడీపీ అభ్యర్థుల తీరుపై మండిపోతోంది. ఇదేనా పొత్తు ధర్మం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

రాయదుర్గంలో పొత్తు 'జిత్తులు'..

రాయదుర్గం నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున కాపు రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి.. ప్రభుత్వ విప్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జ్‌గా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఉండేవారు. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. నిత్యం విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకునేవారు. కానీ ఈసారి కాపు రామచంద్రారెడ్డికి వైఎస్సార్‌సీపీ టికెట్ నిరాకరించడంతో ఆయన బీజేపీలో చేరిపోయారు. పొత్తులో భాగంగా ఆయన టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తరఫున ప్రచారం చేయాల్సి ఉంది. అయితే.. నిన్న మొన్నటి వరకు తీవ్రస్థాయిలో దూషించుకున్న ఈ ఇద్దరు నేతలు ఇప్పుడు కలసి తిరిగితే ప్రజల్లోకి ప్రతికూల సంకేతాలు వెళతాయనే భావనకు వచ్చారు. దీనికి తోడు మైనార్టీల ఓట్లు దూరమవుతాయనే ఉద్దేశంతో కాపుతో పాటు ఇతర బీజేపీ నేతలను కూడా ప్రచారానికి దూరం పెడుతున్నారు. ఉమ్మడిగా తిరిగితే తలెత్తే పరిణామాలపై ఇటీవల బళ్లారిలో కాలవ, కాపు కలసి చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కాలవ ప్రచారానికి కాపు రావడం లేదన్న చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా సాగుతోంది.

ఉరవకొండలోనూ అదే తీరు

బీజేపీతో దోస్తీ కోసం చంద్రబాబు అష్టకష్టాలు పడితే ఉరవకొండ నియోజకవర్గంలో మాత్రం టీడీపీ నేతలు కమలం పార్టీని పూచిక పుల్లలా చూస్తున్నారు. టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ ఎక్కడా తన వెంట ప్రచారానికి బీజేపీ నాయకులను తీసుకెళ్లడం లేదు. మైనార్టీలు దూరమవుతారన్న భయంతో ప్రచారానికి రావొద్దని బీజేపీ నాయకులకు కరాఖండీగా చెప్పినట్లు సమాచారం. కేవలం నలుగురైదుగురు జనసేన నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న కేశవ్‌కు.. తమ సేవలు అవసరం లేదా అంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ఆయన తీరుపై బీజేపీ అధినాయకత్వానికి ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు టీడీపీ, బీజేపీ, జనసేనలకు ఓటు వేసే ముందు ముస్లింలు జాగ్రత్తగా ఆలోచించాలని, టీడీపీకి ఓటు వేస్తే మతతత్వ బీజేపీకి వేసినట్లేనని ఏపీ ముస్లిం మేధావుల సంఘం కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తోంది.

వాహనం ఢీకొని కృష్ణజింక మృతి



నల్లచెరువు: మండలంలోని ప్యాయలవారపల్లి వద్ద బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని కృష్ణజింక మృతి చెందింది. మరో జింక తీవ్రంగా గాయపడింది. జాతీయ రహదారి దాటుతున్న సమయంలో వాహనం ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ముందుకు దూసుకెళ్లాడన్నారు. ఘటనలో తలకు తీవ్ర గాయమైన ఓ జింక అక్కడికక్కడే మృతి చెందిందని వివరించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని గాయపడిన జింకకు చికిత్స అందజేశారు. జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత ఆత్మహత్య

మడకశిర రూరల్: మండలంలోని బుళ్లసముద్రం గ్రామానికి చెందిన వివాహిత నేత్రావతి (27) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం గుడ్డదహళ్లి గ్రామానికి చెందిన నేత్రావతికి మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామానికి చెందిన రామాంజనేయులుతో వివాహమైంది. పెళ్లై ఎనిమిదేళ్లైనా సంతానం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న నేత్రావతి బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మనోహర్ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

తాడిమర్రి: మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదంటూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం నార్శింపల్లి గ్రామానికి చెందిన గోగుల నాగశివుడు (52) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు మద్యం తాగేందుకు డబ్బు కావాలని భార్య నారాయణమ్మను అడిగాడు. ఆమె తన వద్ద లేవని చెప్పి, పనిపై బయటకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న నాగశివుడు... చిన్న పిల్లల కోసం చీరతో వేసిన ఉయ్యాలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే సమయంలో ఇంట్లోకి అడుగు పెట్టిన నారాయణమ్మ... ఉరికి వేలాడుతున్న భర్తను చూసి గట్టిగా కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారు అక్కడకు చేరుకుని నాగశివుడిని కిందకు దించారు. వెంటనే ఇతరుల సాయంతో భర్తను బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి నారాయణమ్మ తీసుకెళ్లింది. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


మృతుడు పురుషోత్తం రెడ్డి

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి (30) బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు, బంధువులు తెలిపారు. మేనమామ నల్లపరెడ్డి, ఆయన భార్య నాగరత్నమ్మ మాట్లాడుతూ... బుధవారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటి దగ్గరే ఉన్నాడు. అనంతరం నల్లాలమ్మ గుడి వెనుక దొడ్డి వద్దకు వెళ్లడంతో అక్కడి నుంచి నల్లపరెడ్డి ఇంటికి చేరుకుని ముసర నీళ్లు తీసుకెళ్లి దొడ్లోని పాడి పశువుల కోసమని తొట్లో పోశాడు. మూడు సారి నీళ్లు తీసుకెళ్లే సమయంలో మంచంపై పురుషోత్తంరెడ్డి పడుకుని ఉండడం గమనించాడు. నాలుగో సారి ముసర నీళ్లను తెచ్చేందుకు వెళుతుండగా సమీప బంధువు, పురుషోత్తం రెడ్డి స్నేహితుడు ఎదురు రావడంతో మంచంపై నిద్రిస్తున్నాడని తెలిపి, లేపి ఇంటికి పిలుచుకు రమ్మని చెప్పి నల్లపరెడ్డి ఇంటికి చేరుకున్నాడు. ఎంతలేపినా పురుషోత్తం రెడ్డి లేవకపోవడంతో విషయాన్ని నల్లపరెడ్డికి చేరవేశాడు. వెంటనే నల్లపరెడ్డి, బంధువులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు గ్రహించి, సమాచారం అందివ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మునిస్వామి తెలిపారు. కాగా, మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

దుప్పి మాంసం విక్రేత అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న అటవీ శాఖ అధికారులు

గోరంట్ల: దుప్పి మాంసం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. బుక్కపట్నం అటవీ శాఖ రేంజర్ శ్రీనివాసరెడ్డి తెలిపిన మేరకు... గోరంట్ల మండలం వెంకటరమణపల్లికి చెందిన వడ్డే రామచంద్రప్ప మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో దుప్పిని వేటాడి బావి సమీపంలో మాంసాన్ని విక్రయానికి ఉంచాడు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని రామచంద్రప్పను అదుపులోకి తీసుకున్నారు. ఐదు కిలోల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి, రేంజర్ కార్యాలయానికి తరలించారు.

వడదెబ్బతో మేకల కాపరి మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని కెంచానపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (69) వడదెబ్బతో బుధవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్న వన్నూరుస్వామి మంగళవారం ఎండ వేడిమికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మానసిక క్షోభతో వలంటీర్ మృతి


మృతుడు చంద్రానాయక్


అనాథలైన ఇద్దరు కుమారులు

పుట్టపర్తి అర్బన్: వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సాగిస్తున్న దుష్ప్రచారంతో తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తూ ఓ వలంటీర్ మృతి చెందాడు. వివరాలు... పుట్టపర్తి మండలం పెడపల్లి చిన్నతండాకు చెందిన గడ్డం చంద్రానాయక్ (38)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థలో చంద్రానాయక్ ప్రజా సేవ చేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులున్నా ఓపికగా భరిస్తూ గుట్టుగా సంసారాన్ని నెట్టుకొచ్చారు. గత కొంత కాలంగా తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను తీసేస్తామని, వలంటీర్లపై కేసులు నమోదు చేస్తామంటూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనసేనాని పవన్‌కళ్యాణ్ బెదిరింపులకు దిగడంతో చంద్రానాయక్‌లో ఆత్మస్థైర్యం లోపించింది. ఇదే అంశాన్ని పలువురితో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం క్యాన్సర్ లక్షణాలు బయటపడ్డాయి. అయినా వలంటీర్‌గా తన బాధ్యతను ఎంతో సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వచ్చారు. వలంటీర్లపై పగబట్టిన చంద్రబాబు... ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మరింత ద్వేషపూరితంగా వ్యవహరిస్తూ నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ల వ్యవస్థను నైతికంగా దెబ్బతీశారు. దీంతో రెండు నెలలుగా ఇంటికే పరిమితమైన చంద్రానాయక్... ఇకపై తమకు గౌరవ వేతనం అందదేమోననే మానసిక క్షోభకు లోనయ్యాడు. ఈ వేదనలోనే బుధవారం ఆయన తుదిశ్వాస విడిచారు. దీంతో భార్య లలితాబాయి, ఇద్దరు కుమారులు అనాథలయ్యారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేని తమకు దిక్కెవరు? కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి అంటూ లలితాబాయి రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది. తల్లిదండ్రులు సైతం అనారోగ్యంతో మంచాన పడ్డారని, ఈ స్థితిలో పిల్లలు, వృద్ధులను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదంటూ బోరున విలపించింది.

రమణీయం.. నెట్టికంటుడి రథోత్సవం


0000000


అశేష భక్తజనం నడుమ సాగుతున్న రథోత్సవం


రథంలో కొలువుదీరిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి రథోత్సవం బుధవారం రమణీయంగా సాగింది. ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం వేకువజామునే నెట్టికంటి ఆంజనేయ స్వామికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ఆలయ ప్రధాన గోపురం ముందు భాగంలో రథాన్ని నిలిపి హోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామిని రథంలో కొలువుదీర్చారు. ఆలయ ఈఓ భద్రాజీ, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ నారికేళాలు సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. పురవీధుల్లో అడుగడుగునా భక్తులు స్వామికి కొబ్బరి కాయలు సమర్పించారు. ఉత్సవంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

'అమ్మ ఒడి' సల్లంగ ఉండగా...




'అమ్మ ఒడి' సల్లంగా ఉండగా ఇలాంటి ఎండలు మమ్మల్ని ఏమీ చేయలేవనే ధైర్యం వారిది. చల్లని 'విద్యా దీవెన'లతో ఉన్నత శిఖరాలు చేరుకోవడమే లక్ష్యంగా బడిలో తారల్లా మెరిశారు. శిశిరం వెనుకే వసంతం ఉందని, ప్రకృతి ధర్మానికి తాము వ్యతిరేకులం కాదంటూనే బడి వీడిన తర్వాత మండుటెండను సైతం లెక్కచేయకుండా ఇంటి దారి పట్టారు. ఒంటి పూట బడుల నేపథ్యంలో రోజూ ఇది నిత్యకృత్యమే అయినా విద్యార్థుల్లో ఏదో తరగని ఉత్సాహం. వారి ఆత్మస్థైర్యం ముందు సూరీడు సైతం వెలవెలబోయాడు. అనంతపురంలోని సప్తగిరి సర్కిల్‌లో బుధవారం మధ్యాహ్నం తలపై చున్నీలు, టోపీలు, పుస్తకాలు పెట్టుకుని ఆశావాదులై అడుగు ముందుకేస్తున్న విద్యార్థులను చూసి పలువురు ఆశ్చర్యపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం: